సాక్షి
చిత్తూరు
సోమవారం । 31 । మార్చి । 2025



పెద్దబైలులో కోడెగిత్తల జోరు

వెదురుకుప్పంలోని పెద్దబైలులో ఆదివారం ఎడ్ల పందేల్లో పోటీపడి యువకులు ఎద్దులను నిలువరించేందుకు ఉత్సాహం చూపారు. - 8లో



'తమ్ముళ్ల' బెట్టింగ్!

జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ కూటమి పార్టీకి చెందిన వారి కనుసన్నల్లో నడుస్తోందని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. - 8లో



సుమశోభితం

తిరుమల : ఉగాది సందర్భంగా తిరుమలలో శ్రీవారి ఆలయాన్ని పుష్పాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

విశ్వావసు..విజయోస్తు



కాణిపాకం ఆలయంలో ఉగాది పంచాంగ శ్రవణం చేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఈఓ కిషోర్ పాల్గొన్నారు. - కాణిపాకం

సాక్షి ఉగాది సంబరాలు



తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకలలో భాగంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. - తిరుపతి తుడా, తిరుపతి సిటీ


ఈద్-ఉల్-ఫితర్



జిల్లాలో రంజాన్ సందర్భంగా ఈద్గాలు, మసీదుల్లో సోమవారం ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేసి ముస్తాబు చేశారు. - కాణిపాకం

న్యూస్‌రీల్

ఐకమత్యానికి ప్రతీక రంజాన్



డాక్టర్ పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, మాజీ మంత్రి



పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ

పుంగనూరు : రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా, రాజంపేట పార్లమెంటు పరిధిలోని ముస్లింలు అందరూ ఐకమత్యంతో కుటుంబ సభ్యులతో కలసి రంజాన్ పండుగను జరుపుకోవాలని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిధున్‌రెడ్డి ఆకాంక్షించారు. క్రమశిక్షణ, ఐకమత్యానికి ముస్లింలు ప్రతీకగా నిలిచారని కొనియాడారు.

కుటుంబ సభ్యులతో కలిసి..



శ్రీనివాసులు, జడ్పీ చైర్మన్

చిత్తూరు కార్పొరేషన్ : ప్రేమ, శాంతి ఐక్యతకు ప్రతీక రంజాన్ అని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ముస్లింలకు పవిత్రమైన పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని జిల్లాలోని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేటి 'పది' పరీక్ష వాయిదా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించాల్సిన పదో తరగతి పబ్లిక్ పరీక్షను ప్రభుత్వం వాయిదా వేసిందని డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని సోషల్ పరీక్షను ఉన్నతాధికారులు వాయిదా వేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీన సోషల్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిల్లాలో 55 రిజిస్ట్రేషన్లు



చిత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న క్రయ, విక్రయదారులు

చిత్తూరు కార్పొరేషన్ : వార్షిక నెల చివరి రోజులు కావడంతో ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సెలవులు రద్దు చేశారు. అందులో భాగంగా జిల్లాలోని 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నందు మొత్తం 55 రిజిస్ట్రేషన్లు జరిగి తద్వారా రూ.9.10 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందని జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి తెలిపారు. సోమవారం రంజాన్ సెలవు అయినప్పటికీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయన్నారు. ఈ అవకాశాన్ని క్రయ, విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయ లక్ష్యం రూ.221 కోట్లు కాగా ఇప్పటి వరకు 150 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. అందులో మార్చినెల లక్ష్యం రూ.24 కోట్లుగా కాగా రూ.14 కోట్లు వచ్చిందన్నారు. దాదాపు మొత్తం లక్ష్యంలో 68 శాతం వరకు సాధించామని వివరించారు.

ఆరోగ్యసిరి

రామసముద్రంలోని వర్మీకంపోస్టు కేంద్రం



బెడ్స్‌లో తయారవుతున్న వర్మీకంపోస్టు



మహేశ్వరరావు పెంచుతున్న దేశీయ ఆవులు



ఎలాంటి రసాయనాలు వినియోగించకుండా వ్యవసాయం చేయడంలో ఆయన ఒక డాక్టర్.. నిస్సారమైన భూముల్లో బంగారు పంటలు పండించే స్పెషలిస్టు.ఆకలి తీర్చడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం అందించే పంటలకు ప్రాణం పోస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ..వర్మీకంపోస్టు (వానపాముల ఎరువు) జీవామృతం ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తూ పండించే పంటలు ఆరోగ్యం అందించడంతోపాటు ఆదాయం ఆర్జిస్తున్నారు. ఇతర రైతులను ప్రకృతి వ్యవసాయం వైపుగా నడిపిస్తున్న రామసముద్రం రైతు మహేశ్వరరావు పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

- ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం
- పదేళ్లుగా వర్మీకంపోస్టు కేంద్రం నిర్వహణ
- సాటి రైతులను ప్రకృతి సేద్యం వైపు నడిపిస్తున్న వైనం
- రైతు మహేశ్వరరావు చొరవ ఆదర్శనీయం

పుత్తూరు : మండలంలోని రామసముద్రం గ్రామానికి చెందిన మహేశ్వరరావుకు అయిదెకరాల వ్యవసాయ పొలం ఉంది. నిద్ర లేచింది మొదలు రాత్రి దాకా పొలంలోనే ఉండటం ఆయనకు అలవాటు. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన వ్యవసాయంలో తనదైన శైలిలో సాగు చేయడాన్ని పదేళ్ల కిందటే మొదలు పెట్టాడు. వ్యవసాయం చేయడం ద్వారా లాభాలను మాత్రమే పొందాలనుకోలేదు. మనం అందించే వ్యవసాయ ఉత్పత్తులు ఆకలిని తీర్చడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలనేది ఆయన ఆశయం.

ప్రకృతి సేద్యంలో ఉపయోగించే సేంద్రియ ఎరువుల్లో ఒకటైన వర్మీకంపోస్టును ఎంచుకున్నాడు. దానిని పదేళ్లుగా తయారు చేస్తూ ఇతర రైతులకు విక్రయిస్తూ తానూ వినియోగిస్తూ మంచి దిగుబడులు సాధిస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇలా వర్మీకంపోస్టు తయారీ కేంద్రాలు కేవలం మరో రెండు చోట్ల మాత్రమే ఉండడం గమనార్హం. రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాల్వలో రామ్మోహన్‌నాయుడు, వడమాలపేట మండలం వేమూరులో అయ్యప్పనాయుడు వర్మీకంపోస్టులను నిర్వహిస్తున్నారు. ఇలాంటి ప్రకృతి సేద్యంపై మక్కువ చూపే వారిని ప్రభుత్వం ప్రోత్సహించాల్సి ఉంది.

వర్మీకంపోస్టు తయారీ విధానం

సేంద్రియ వ్యర్థాలతో వానపాములను ఉపయోగించి పోషకాలు సమృద్ధిగా ఉన్న ఎరువుగా మార్చే ప్రక్రియే వర్మీకంపోస్టు లేక వానపాముల ఎరువు అని పిలుస్తారు. ఇది ప్రకృతి సేద్యంలో ఉపయోగించే సేంద్రియ ఎరువుల్లో ఒకటి.

- చల్లటి, నీడ ఉన్న ప్రదేశంలో 3 అడుగుల వెడల్పు, ఒక అడుగు ఎత్తుతో అవసరమైన పొడవుతో బెడ్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- బెడ్‌ను ఎప్పుడూ తడిగా ఉంచుకోవాలి. అయితే అధిక తేమ ఉండకుండా చూసుకోవాలి.
- దేశీయ ఆవుల ఎరువు, పంటల వ్యర్థాలు, కూరగాయల తొక్కలు వంటి సేంద్రియ పదార్థాలను సేకరించుకోవాలి.
- బెడ్‌లో సేంద్రియ పదార్థాలను పొరలు పొరలుగా పేర్చాలి.
- వానపాములను విడుదల చేయాలి. 30 నుంచి 45 రోజుల తర్వాత వానపాములు సేంద్రియ పదార్థాలను కంపోస్టుగా మార్చుతాయి.



వర్మీకంపోస్టు ద్వారా ఏపుగా పెరిగిన వరి పంట

జీవామృతం తయారీ ఇలా..

- ఒక డ్రమ్‌లో 200 లీటర్ల నీటిని తీసుకోవాలి. అందులో 10 కిలోల దేశీయ ఆవు పేడ, 5 నుంచి 10 లీటర్ల ఆవు పంచితం, 2 కిలోల అలసందల పొడి లేక శనగపప్పు పిండి కలపాలి. దీనిని రెండు రోజుల్లో రెండు మూడు విడతలుగా బాగా కలపాలి.
- 48 గంటల తర్వాత జీవామృతం తయారవుతుంది.
- లీటరు నీటిలో 10 మిల్లీ లీటర్ల జీవామృతం కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.
- పంటలకు నీరు కట్టే సమయంలోనూ జీవామృతం వినియోగించవచ్చు.

వర్మీకంపోస్టు, జీవామృతంతో కలిగే ప్రయోజనాలు

- భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- నేల సారవంతమై మొక్కల పెరుగుదలకు సహాయ పడుతుంది.
- రసాయన ఎరువుల అవసరం తగ్గిపోతుంది.
- మొక్కలు సహజంగా తెగుళ్లను తట్టుకునే శక్తిని పొందుతాయి.
- అధిక దిగుబడులు సాధించవచ్చు

ప్రతి రైతు ఆవులను పెంచాలి



“ నా తల్లిదండ్రులు నిర్మలాదేవి, వెంకటాచలంనాయుడు. నాకు 50 దేశీయ ఆవులు ఇచ్చారు. నేను వాటిని 70కి పెంచాను. వాటి పేడతోనే వర్మీకంపోస్టు తయారు చేస్తున్నా. పంటల సాగులో దానిని వినియోగిస్తూ మంచి దిగుబడులను పొందుతున్నా. మనం ఆరోగ్యంగా జీవించాలంటే మనం తీసుకొనే ఆహారం విష తుల్యం కాకుండా చూసుకోవాలి. కొన్నేళ్లుగా ప్రతి పంట విష తుల్యంగా తయారవుతోంది. ప్రకృతి సేద్యం ద్వారా మంచి దిగుబడితో పాటు ఆరోగ్యవంతమైన పంటలు మన సొంతం అవుతాయి. తన వంతుగా వర్మీకంపోస్టును స్వయంగా తయారు చేస్తున్నా. మిగిలిన రైతులను ప్రోత్సహిస్తున్నా.

– ఎస్.మహేశ్వరరావు, వర్మీకంపోస్టు తయారీదారుడు, రామసముద్రం, పుత్తూరు మండలం

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయాలి



ప్రస్తుతం ప్రజలందరూ ఆరోగ్య ఉత్పత్తులనే కోరుకుంటున్నారు. ఇందుకు ప్రకృతి వ్యవసాయమే మార్గం. 1996లో తిరుపతిలో ప్రారంభించిన గ్రామీణాభివృద్ధి సంక్షేమ సంస్థ (వర్డ్) ద్వారా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కోసం పనిచేస్తున్నాం. ఈ కోవలో నడుస్తున్న రైతులందరికీ ప్రభుత్వం తన వంతు సహకారం అందించాలి. అలాగే హైస్కూల్ నుంచి యూనివర్సిటీ విద్యార్థుల వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అలవాటు చేయాలి. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– డాక్టర్ కె.గంగాధరం, కార్యదర్శి, వర్డ్, తిరుపతి

సంస్కృతి..సంప్రదాయాలను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఉగాది సంబరం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- చిత్తూరులో ఉగాది మహోత్సవం
- కవులు, పండితులకు అందని సమాచారం
- విద్యార్థులతోనే ఉత్సవాలు ముగింపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : సంస్కృతి..సంప్రదాయాలను కాపాడుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఉగాది మహోత్సవం నిర్వహించారు. వారు ముఖ్య అతిథిగా పాల్గొని ఉగాది మహోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం వేద పండితులు చిలకమర్తి వెంకట సుబ్బారావుతో పంచాంగ శ్రవణం చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు అలవర్చాలన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

శ్రీ కృష్ణదేవరాయల కాలంలో భువన విజయంలోని అష్ట దిగ్గజాలచే జరిగిన కవి సమ్మేళనాన్ని గుర్తుచేస్తూ.. ఈనాటి తరానికి తెలుగు భాష ప్రాముఖ్యం వివరిస్తూ కవితా ప్రావీణ్యం ప్రదర్శించారు. చిన్నారులచే జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, కవులు, పండితులను సన్మానించారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ కఠారి హేమలత, డీఆర్వో మోహన్‌బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట రమణ, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏఓ కుల శేఖర్, టూరిజం మేనేజర్ గౌరీ పాల్గొన్నారు.

చప్పగా మహోత్సవం

గతంలో ఉగాది వేడుకలంటే తెలుగుదనం ఉట్టిపడేలా ఉండేది. అన్ని శాఖల అధికారులు సంప్రదాయ దుస్తులతో వేడుకలకు హాజరయ్యేవారు. అందరిని ఆహ్వానించి నూతన వేడుకలను సంబరంలా నిర్వహించేవారు. అలాగే అర్చకులు, కవులు, పండితులతో సభ కళకళలాడేది. ఈ ఏడాది ఉగాది వేడుకలకు విద్యార్థులతోనే మమ అనిపించారు.





విద్యార్థుల నృత్య ప్రదర్శన

కవులు, పండితులకు సమాచారం ఏదీ..

జిల్లాలోని 90 శాతం అర్చకులు, పండితులు, కవులకు ఉగాది మహోత్సవానికి ఆహ్వానం కరువైంది. దేవదాయశాఖ అధికారులు తమకు సమాచారం ఇవ్వలేదంటూ అర్చక పండితులు మండిపడుతున్నారు. ఇచ్చిన వాళ్లకు మళ్లీ ఇవ్వడంపై విమర్శలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో అర్చక పురోహితులు ఉన్నప్పటికీ...కాణిపాకంలోని పండితులను పిలిచి పంచాంగ శ్రవణం చేయడంపై విమర్శలు చేస్తున్నారు. దేవదాయశాఖ అధికారులకు అనుకూలంగా ఉన్నవారికేనా గుర్తింపు.. సన్మాన ఫలాలంటూ పలువురు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.

కడుపున పుట్టినోళ్లా..తోడేళ్లా?

సమాజంలో కొడుకు పుడితే చాలనుకుంటారు. ఇంటి పేరు నిలబెడతాడని గొప్పలు చెప్పుకుంటారు. పెంపకం నుంచి పెళ్లిళ్ల.. ఆస్తి పంపకాల వరకు సుపుత్రుడికే సముచిత స్థానం కల్పిస్తారు. కానీ ఇందులో చాలా మంది కుమారులు జీవిత చరమాంకంలో తల్లిదండ్రులను గాలికి వదిలేస్తున్నారు. ఆస్తి పాస్తులను తనపేరున రాసుకుని అనాథశ్రమాలలో వదిలేస్తున్నారు. ఇది చాలదన్నట్లు ఇంటిపని.. వంట పనిచేయలేదంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. మరికొందరు తమకు చెడు చేస్తున్నారన్న ఉద్దేశంతో అకారణంగానే ద్వేషం పెంచుకుంటున్నారు. అల్లారుముద్దుగా పెంచిన అమ్మానాన్నలపైనే పిడుగుద్దులు కురిపిస్తున్నారు. ఇలాంటి ఘటనే చౌడేపల్లె మండలంలో చోటు చేసుకుంది.

- పండుగ పూట దాడి
- తండ్రి కాలు, చేయి విరిచేసిన కుమారుడు
- వృద్ధ దంపతులపై కొడుకు, కోడలు పైశాచికం
- ఆస్తి తగాదాలే వేధింపులకు కారణం
- చౌడేపల్లె మండలంలో దారుణ ఘటన

చౌడేపల్లె : మండలంలోని ఏ.కొత్తకోట పంచాయతీ, అంకుతోటపల్లెకు చెందిన చిన్నపరెడ్డి(90), రాజమ్మ(85)కు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం చేసి మెట్టినింటికి పంపించారు. కుమారుడు మనోహర్ పెళ్లి చేసుకొని స్వగ్రామమైన అంకుతోటపల్లెలోనే నివాసం ఉన్నారు. తల్లిదండ్రులపై 1.60 సెంట్లను కుమారుడు తన పేరిట మార్చుకున్నాడు.

అక్కడి నుంచే వేధింపులు..

కొంత కాలం తర్వాత కొడుకు మనోహర్, కోడలు సరస్వతీ అనారోగ్యం పాలయ్యారు. తల్లిదండ్రులే తనకు చెడు చేశారని, అందుకే ఇలా అయ్యిందని కొడుకు మనోహర్ భావించాడు. అప్పటి నుంచి అమ్మా నాన్నలపై దాడి చేయడం ప్రారంభించాడు. కొడుతూ.. తిడుతూ నిత్యం నరకం చూపించేవాడు. కోడలి సూటిపోటి మాటలకు అత్తామామలు నలిగిపోయేవారు. దీన్ని భరించలేక గత జనవరి 2న స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఆపై రెండు వారాల క్రితం పలమనేరు ఆర్డీవోను సంప్రదించారు. కొడుకు లాక్కున్న భూమిని ఇప్పించాలని ప్రాధేయపడ్డారు.



ఆస్పత్రిలో లేవలేని స్థితిలో చిన్నపరెడ్డి

బతిమాలినా?

'నాయనా మాకు తిండీ తిప్పలు పెట్టాల్సిన పనిలేదు. ఎలాగోలా బతికేస్తాం. మమ్మల్ని కొట్టకుండా చూడండి నాయనా' అంటూ వృద్ధ దంపతులు పోలీసుల కాళ్లావేళ్లా పడ్డారు. కొడుకు, కోడలు నుంచి రక్షణ కల్పించాలని వేడుకున్నారు. ఈ మేరకు పోలీసులు గతంలో చిన్నపరెడ్డి కొడుకు, కోడలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు.



ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన రాజమ్మ (ఫైల్)

పండగ పూట కాలూచేయి విరిచేశాడు!

ఉగాది పండుగ అయిన ఆదివారం మళ్లీ చిన్నపరెడ్డిపై కుమారుడు దాడికి పాల్పడ్డాడు. విక్షణా రహితంగా తన తండ్రిని చితకబాదాడు. ఆపై కాలు, విరిచేశాడు. స్థానికులు ముందుగా పుంగనూరు ఆస్పత్రికి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యులు తిరుపతి రూయాకు తీసుకెళ్లాలని సూచించారు.

'రంజాన్' ఆనందంగా జరుపుకోవాలి



సుమిత్ కుమార్ గాంధీ, జిల్లా కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ముస్లిం సోదరులు రంజాన్ పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ పేర్కొన్నారు. రంజాన్ పండుగ సామరస్యానికి, కరుణ, దాతృత్వానికి ప్రతీక అని అన్నారు. ఈ పండుగను జిల్లాలోని ముస్లింలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు.



మణికంఠ, జిల్లా ఎస్పీ

ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు

చిత్తూరు అర్బన్ : రంజాన్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు నిర్వహించుకోవాలని ఎస్పీ మణికంఠ కోరారు. జిల్లాలోని అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద పోలీసులతో పటిష్ట భద్రత కల్పించామన్నారు.

క్లుప్తంగా

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. సోమవారం రంజాన్ పురస్కరించుకుని ప్రభుత్వ సెలవు కావడంతో గ్రీవెన్స్ రద్దు చేసినట్లు తెలిపారు.

ఏప్రిల్ 3 నుంచి 'పది' మూల్యాంకనం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి మూల్యాంకనం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధి కారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనానికి జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేశారు. ఇప్పటికే పలు జిల్లాల నుంచి వి చ్చేసిన పది పరీక్షల జవాబుపత్రాలను ఆ పాఠశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. మూ ల్యాంకన కేంద్రంలో పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాల నిఘాను ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా వి ద్యాశాఖ అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు. డీఈఓ వరలక్ష్మి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రానికి సమీపంలో మురకంబట్టు వద్ద ఉన్న మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ భార్గవి తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి తమ పాఠశాలలో 5వ తరగతిలో చేరేందుకు 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో (బ్యాక్ లాగ్) సీట్ల అడ్మిషన్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రవేశాల ప్రక్రియలో జిల్లాలోని ముస్లిం (బీసీ–ఈ, బీసీ–బీ, బీసీ–సీ, కన్వర్టెడ్ క్రిస్టియన్)లకు మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఏప్రిల్ 31వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 87126 25058 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

దేవదాయశాఖ కార్యాలయంలో ప్రింటర్ మాయం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : నగరంలోని దేవదాయశాఖ కార్యాలయంలో ప్రింటర్ మాయమైందనే ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. గిరింపేటలోని ఓ అమ్మవారి దేవస్థాన సహకారంతో ఓ ప్రింటర్‌ను కార్యాలయ అవసరం నిమిత్తం కొనుగోలు చేశారు. కొటేషన్ ప్రకారం రూ. 14,500 విలువ చేసే ప్రింటర్‌ను కొన్ని నెలల కిందట కొనుగోలు చేశారు. బహూకరించిన ఆలయ సిబ్బందికి ప్రింటర్‌ను తళ్లుక్కుమనేలా చూపించి మాయం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్క రోజుల్లోనే మాయమైన ప్రింటర్ ఎలా రిపేర్ అవుతుందా అని...రిపేర్ అయిన ప్రింటర్ ఇప్పటికీ కార్యాలయంలో రాకపోవడానికి కారణాలేమిటని పలువురు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. అప్పటి నుంచే ఆఫీసులో తాళం పంచాయితీ నడుస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

వైభవం.. ఉగాది ఉత్సవం

- సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో 'విశ్వావసు' వేడుకలు
- ఆకట్టుకున్న విద్యార్థుల తెలుగు పద్య, గద్య పోటీలు
- కనువిందు చేసిన సంప్రదాయ వస్త్ర ప్రదర్శన
- విజేతలకు బహుమతుల ప్రదానం
- శాస్త్రోక్తంగా పంచాంగ శ్రవణం
- ఈ ఏడాది ఒడిదొడుకులు తప్పదంటున్న పండితులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, చిత్రంలో సాక్షి సిబ్బంది

తిరుపతి తుడా/తిరుపతి సిటీ : సాక్షి మీడియా ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. ఆదివారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా వైభవంగా జరిపించారు. ఏబీ ఎలక్ట్రానిక్స్, అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్, అన్నమాచార్య వర్సిటీ, శుభమస్తు షాపింగ్ మాల్, కెనరా బ్యాంక్ సంయుక్త సహకారంతో సాక్షి ఉగాది ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉగాది విశిష్టత చాటేలా ఆడిటోరియాన్ని అరటి మొక్కలు, మామిడి ఆకుల తోరణాలతో అలంకరించారు. వీక్షకులను ఆహ్వానించేందుకు వివిధ పూల మొక్కలతో విశేష అలంకరణ చేశారు. వాగ్దేవి, పి.బాలచంద్ర కార్యక్రమానికి యాంకర్లుగా వ్యవహరించారు.

గణపతి పూజతో ప్రారంభం

గణపతి పూజతో సాక్షి ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమానికి పండితులు మహేష్ స్వామి శ్రీకారం చుట్టారు. సాక్షి జనరల్ మేనేజర్ బొమ్మారెడ్డి వెంకటరెడ్డి, ప్రధాన స్పాన్సర్లు ఏబీ ఎలక్ట్రానిక్స్ అధినేతలు మహేష్, మహేంద్ర, అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత అనిత్ కుమార్‌రెడ్డి, కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ పాండురంగ మితంతాయాతో పాటు శుభమస్తు షాపింగ్ మాల్ ప్రతినిధి రవి, అన్నమాచార్యా వర్సిటీ వ్యవస్థాపకుడు గంగిరెడ్డి జ్యోతి ప్రజ్వల చేసి ఉత్సవాలను ప్రారంభించారు.

ఆకట్టుకున్న పోటీలు

ఉగాది ఉత్సవాలలో భాగంగా పద్య, గద్య, సాహిత్య పోటీలను నిర్వహించగా నగరంలోని పలు విద్యాసంస్థల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. తమదైన శైలిలో గీతం, రత్నం, శ్రీ వెంకటేశ్వర, విశ్వం, అకార్డ్, విశ్వ చైతన్య, అకడమిక్ హైట్స్, ఎమ్ఎస్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్, స్ప్రింగ్‌డేల్‌తో పాటు పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. చక్కని తెలుగు వచనాలు, వినసొంపైన శ్లోకాలు, వాటి భావాలను చక్కగా వివరించారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కౌషిక్, క్రిష్ణసాత్విక్, యువరాజ్ గెలుచుకున్నారు. అలాగే మరో ఐదు మందికి ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలతో పాటు ప్రత్యేక బహుమతులు అందజేశారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఒడిదొడుకులు తప్పవు..

విశ్వావసు నామ సంవత్సరంలో అన్ని రంగాలు ఒడుదుడుకులు ఎదుర్కొకతప్పవని ఆగమ శాస్త్ర పండితులు డాక్టర్ పీటీజీ రంగ రామానుజాచార్యులు వెల్లడించారు. ముందుగా ఆయన ఉగాది పచ్చడి విశేషాలను సభికులకు వివరిస్తూ సుగంధ ద్రవ్యాన్ని శాస్త్రోక్తంగా తయారు చేయించి అందిరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరు మంచికి వెళ్లినా చెడు ఎదుర్కోక తప్పని పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు. ఈ క్రమంలోనే విశ్వావసు నామ సంవత్సర రాశిఫలాలను వివరించారు. అనంతరం ఆయనను దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

సాంస్కృతికం...నేత్రానందం...

సాక్షి ఉగాది వేడుకలలో ఏర్పాటు చేసి సాంస్కృతిక ప్రదర్శనలు నేత్రానందంగా సాగాయి. భరతనాట్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి, ప్రముఖ నృత్యకారుడు చల్లా జగదీష్ ప్రదర్శించి తోడైమంగళం జయ జానకీ రమణ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. అలాగే అకార్డ్ స్కూల్ విద్యార్థుల ప్రణవాలయ పాహీ స్వాగత నృత్య రూపకం అలరించింది. జగదీష్ శిష్య బృందం నేహా, భవజ్ఞ, కీర్తనలు ప్రదర్శించిన మల్లారి నృత్యం మైమరిపింపజేసింది. ప్రదర్శకులకు అతిథుల చేతులుగా జ్ఞాపికలు అందజేశారు.

'తమ్ముళ్ల' బెట్టింగ్!

- ఐపీఎల్ క్రికెట్ బెట్టింగులో కూటమి నేతలు
- రోజుకు రూ.లక్షల్లో చేతులు మారుతున్న వైనం
- బెట్టింగులు వద్దంటూ ప్రకటనలకే పరిమితమైన పోలీసులు



చిత్తూరు అర్బన్ : నగరంలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ చాపకింద నీరులా సాగుతోంది. బెట్టింగ్ వ్యవహారం మొత్తం కూటమి పార్టీకి చెందిన కొందరు వ్యక్తుల కనుసన్నల్లో నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెట్టింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని చెబుతున్న పోలీసులు మాత్రం.. ఈ ముఠాలపై నిఘా ఉంచి, చట్టపరంగా ముందుకు వెళ్లడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ –2025 క్రికెట్ మ్యాచ్ సీజన్ ఇటీవల ప్రారంభమయిన విషయం తెలిసిందే. మార్చి 22న ప్రారంభమైన సీజన్–18లో ఇప్పటి వరకు 10 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. మేనెల 25న జరిగే ఫైనల్ మ్యాచ్ కోసం ఇంకా 64 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఎప్పుడూ లేని విధంగా ఈసారి బెట్టింగులు చేసే వారిపై, బెట్టింగ్ యాప్‌లపై కఠినంగా వ్యవహరిస్తామని ప్రభుత్వం, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు బహిరంగంగా ప్రకటిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో జరుగుతున్న బెట్టింగుల వ్యవహారాన్ని మాత్రం కట్టడిచేయడంలో విఫలమతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బాల్..బాల్‌కు ఓ రేటు

చిత్తూరు నగరంలో ఐపీఎల్ బెట్టింగుల జోరు విచ్చలవిడిగా జరుగుతోంది. ప్రధానంగా నగరంలోని మిట్టూరు, గంగనపల్లె, సంతపేట, కొంగారెడ్డిపల్లె, గిరింపేట, కాజూరు, నాయుడు బిల్డింగ్స్, మార్కెట్ చౌక్, తేనబండ, వన్నియర్‌బ్లాక్, కట్టమంచి, రామ్ నగర్ కాలనీ, కన్నయ్యనాయుడు కాలనీ ప్రాంతాల్లో బెట్టింగులు జోరుగా జరుగుతున్నాయి. స్థానికంగా ప్రముఖ యువకులు ఈ బెట్టింగులను నిర్వహిస్తున్నారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు వేసే టాస్ నుంచి ప్రతి ఒక్క ఓవర్‌కు పెద్ద మొత్తంలో డబ్బులు కాస్తూ బెట్టింగులు నిర్వహిస్తున్నారు. బాల్ బాల్‌కు రేటు మారుతూ పోతోంది. పందెం కాసే వారి నుంచి రూ.10 వేలకు రూ.2 వేలు కమీషన్ తీసుకుని ఈ జూదాన్ని నడిపిస్తున్నారు. ఇందులో ఏ ఒక్కరిని కదిపినా.. తనకు అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయని బహిరంగంగానే చెప్పుకుని తిరుగుతున్నారు. దీంతో ఎవ్వరూ నోరు మెదపలేని పరిస్థితి నెలకొంది.

పోలీసుల మౌనం..

బెట్టింగులను అరికట్టడంలో చిత్తూరు నగర పోలీసులు ఏ మాత్రం దృష్టి సారించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోజుకు రూ.లక్షల్లో జరుగుతున్న ఈ జూదంలో చాలా మంది ఇప్పటికే భారీ మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నారు. తేనబండకు చెందిన ఓ యువకుడు గత రెండు సీజన్లలో బెట్టింగులు నిర్వహించి రూ.కోటి వరకు పోగొట్టుకుని.. ఇళ్లు కూడా అమ్ముకున్నాడు. ఎక్కడికక్కడ నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకుని, బెట్టింగుల జాడ కనిపెట్టాల్సిన పోలీసులు మౌనం వహిస్తున్నారు. దీనికి తోడు స్పెషల్‌బ్రాంచ్ విభాగానికి చెందిన పోలీసులు సైతం బెట్టింగుల వ్యవహారంలో సమాచారాన్ని సేకరించడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం కూటమి పార్టీకి చెందిన నేతల అండదండలు ఉండటం వల్లే ఇలా చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. దొంగ సొమ్ములో వాటాలు వేసుకుని రూ.లక్షలు కొల్లగొట్టడంలో కొందరు ఖాకీలు చూపించే శ్రద్ధ.. జూదాన్ని నివారించడంపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

యాదమరి యువతపై బెట్టింగ్ వల

- తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం నుంచి దందా
- ఓ ఇంజినీరింగ్ విద్యార్థి రూ.70 వేలు పోగొట్టుకున్న వైనం

యాదమరి : మండలంలోని యువతపై ఓ తమిళ బెట్టింగ్ మాఫియా కన్నుపడింది. సరిహద్దు రాష్ట్రం తమిళనాడులోని పరదరామి, గుడియాత్తం నుంచి ఈ దందా నడిపిస్తున్నారు. ఇప్పటికే తమ అనుచర గణంతో..గోవా క్యాసినో లో ఏర్పడినటువంటి స్థానిక పేకాట జూదరులతో యువతకు ఎర వేస్తున్నారు. మండలంలోని ఇంజినీరింగ్ చదివే ఓ విద్యార్థి రెండు రోజుల్లోనే రూ. 70 వేలు బెట్టింగ్‌లో పోగొట్టుకొన్నాడనే వార్త జోరుగా ప్రచారం జరుగుతోంది. కళాశాలలో ఫీజు చెల్లింపు కోసం ఉంచుకున్న డబ్బు ఇలా బెట్టింగ్‌లో పోగొట్టుకోవడంతో ఓ ప్రైవేటు వడ్డీ వ్యాపారి నుంచి ప్రామిసరీ బాండ్, ఖాళీ చెక్కులు ఇచ్చి అధిక వడ్డీకి అప్పులు తెచ్చి కళాశాల ఫీజు చెల్లించాడంటే పరిస్థితి ఎంత ఘోరంగా మారిందో తెలుసుకోవచ్చు. ఇలా చాలా మంది యువత బెట్టింగ్ భూతానికి బలవుతున్నారు. పోగొట్టుకున్న సొత్తును ఎలాగైనా సంపాదించాలనే భావనతో ఉన్న ఆస్తులు, బంగారాన్ని ఇంట్లో తెలియకుండా తాకట్టు పెడుతున్నారు. ఈ తరుణంలో ఉన్న డబ్బులు పోయి అప్పులు పాలవుతున్నారు. చివరకు ఆత్మహత్యే శరణ్యమని బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

ప్రత్యేక నిఘా ఉంచాం

యువత బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. బెట్టింగ్‌కు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. ప్రతి గ్రామంలో నిఘా బృందాన్ని ఉంచాం. నమ్మి మోసపోవద్దు. సైబర్ నేరం కంటే ఇది ప్రమాదకరం. బెట్టింగ్ వ్యసనంలో పడితే తిరిగి చూసుకునేందుకు ఏమీ ఉండదు.

– ఈశ్వర్, ఎస్ఐ, యాదమరి

అవమానం భరించలేక ఆత్మహత్యాయత్నం


రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు యత్నించిన మహిళ

చిత్తూరు అర్బన్ : తీసుకున్న రూ.10 వేల అప్పుకు వడ్డీల మీద వడ్డీలు కట్టినా.. అవమానకరంగా మాట్లాడినందుకు ఓ మహిళ ఆత్మహత్యే శరణ్యంగా భావించింది. ఏకంగా రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టగా స్థానికులు, పోలీసులు వచ్చి సకాలంలో ఆమెను రక్షించారు. ఆదివారం చిత్తూరు నగరంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. నగరంలోని కన్నయ్యనాయుడు కాలనీకి చెందిన ప్రియాకు వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈమె భర్త కూలీ పనులు చేస్తుండగా ప్రియా ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఇటీవల ఆమె తన పిల్లాడికి స్కూల్ ఫీజు కట్టడానికి రాజా అనే వ్యక్తి నుంచి రూ.10 వేలు అప్పుగా తీసుకున్నారు. ఇందుకుగానూ ప్రతివారం రూ.3 వేలు చొప్పున రెండు నెలలుగా చెల్లించారు. అయితే అది మొత్తం వడ్డీ కింద జమ చేసుకున్నారని, అసలు రూ.10 వేలు ఇచ్చి తీరాల్సిందేనంటూ రాజా అనే వ్యక్తి ఇటీవల బాధితురాలిని బెదిరించాడు. ఫోన్‌లో సైతం ఆమెను అసభ్యంగా తిడుతూ వేధించాడు. ఈ బాధలు, అవమానం భరించలేని ప్రియా.. ఆదివారం మధ్యాహ్నం మెసానిక్ మైదానం సమీపంలో ఉన్న రైల్వే పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. అటువైపుగా రైలు వచ్చేందుకు 15 నిముషాలు ఉందనగా, ప్రియాను గుర్తించిన జ్ఞానరాజ్ అనే వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆమెను బలవంతంగా పట్టాలపై నుంచి పక్కకు లాక్కెళ్లారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలను తెలుసుకుని, కౌన్సెలింగ్ ఇచ్చారు. వేధింపులకు గురిచేసిన రాజా అనే వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

చిత్తూరు నగరంలో హేమలత (48) అనే వివాహిత ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. టూ టౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. నగరంలోని టెలిఫోన్ కాలనీకి చెందిన హేమలతకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతున్నారు. దీంతో కలత చెంది ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బాత్ రూమ్‌కి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తాగి దంపతుల ఆత్మహత్యాయత్నం

- ఇద్దరి పరిస్థితి విషమం
- బాధితులు బంగారు పాళ్యం వాసులుగా గుర్తింపు

శ్రీరంగరాజపురం : దంపతులు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మండల పరిధిలోని పిళ్లారికుప్పం సమీపంలోని ఓ మామిడి తోటలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. బంగారుపాళ్యంకు చెందిన శంకర్, నిర్మల దంపతులు చిత్తూరుకు చెందిన విశ్రాంతి ఆర్మీ జవాన్ రవి శ్రీరంగరాజపురం మండలం పిళ్లారికుప్పం సమీపంలో మామిడి తోటను కొనుగోలు చేశారు. ఆ తోటకు కాపాలగా బంగారుపాళ్యంకు చెంది శంకర్, నిర్మల దంపతులను అందులో ఉంచారు. అయితే ఆదివారం సాయంత్రం దంపతుల మధ్య కలహాలు చోటుచేసుకోవడంతో మనస్తాపానికి గురైన దంపతులు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టారు. ఈ క్రమంలో సమీపంలోని పశువుల కాపరులు గుర్తించి స్థానికులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వారివురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహనం ద్వారా తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందాలు.. 11 మంది అరెస్ట్

– రూ.1.08 లక్షల స్వాధీనం

పుంగనూరు : చట్టవిరుద్ధంగా కోడిపందాలు నిర్వహిస్తున్న 11 మందిని పట్టుకుని వారి నుంచి రూ.1.08 లక్షలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని మేకంజామనపల్లె చెరువులో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి పందెం నిర్వహిస్తున్న 11 మందిని, 5 కోడి పుంజులను, రూ.1.08 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పందెం నిర్వహిస్తున్న 11 మందిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కోడి పందాలు, జూదం, పేకాట లాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలన్నారు.

ఆరుగురు కోడి పందెంరాయుళ్ల అరెస్టు

చౌడేపల్లె: మండలంలోని 29ఏ చింతమాకులపల్లె సమీపంలో కోడి పందెం ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ముందుగా అందిన సమాచారం మేరకు చింతమాకులపల్లె చింత తోపులో కోడి పందెం ఆడుతున్న వారిపై దాడి చేశామన్నారు. వెంకటరమణారెడ్డి, రమణ (బయ్యపల్లె), సుధాకర్, సురేష్ (చింతమాకులపల్లె), నాగరాజ (బిల్లేరు), వెంకటరమణ (చదళ్ల)ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి నుంచి రెండు పందెం కోళ్లు, కోడికత్తులు, రూ.3,600 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పుంగనూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

7 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఏప్రిల్ 7వ తేదీ నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 (సీబీఏ-3) పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్, నియమ నిబంధనలను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదివారం జారీచేశారు. ఏప్రిల్ 7 నుంచి 17వ తేదీ వరకు ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు పరీక్షలు జరుగుతాయి. ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

తేదీ	1 నుంచి 5వ తరగతి వరకు	6 నుంచి 9 వ తరగతి వరకు
ఏప్రిల్ 7	–	మొదటి ల్యాంగ్వేజ్
ఏప్రిల్ 8	–	సెకండ్ ల్యాంగ్వేజ్
ఏప్రిల్ 9	మొదటి ల్యాంగ్వేజ్	మూడవ ల్యాంగ్వేజ్
ఏప్రిల్ 10	ఇంగ్లిష్	గణితం
ఏప్రిల్ 11	గణితం	జనరల్ సైన్స్/పిజికల్ సైన్స్
ఏప్రిల్ 12	ఈవీఎస్ (3, 4, 5 తరగతులకు)	బయాలజికల్ సైన్స్
ఏప్రిల్ 15	ఓఎస్ఎస్‌సీ (3, 4, 5 తరగతులకు)	సోషల్ స్టడీస్
ఏప్రిల్ 16	–	కాంపోజిట్ కోర్సు, ఓఎస్ఎస్‌సీ పేపర్–1
ఏప్రిల్ 17	–	కాంపోజిట్ కోర్సు, ఓఎస్ఎస్‌సీ పేపర్–2

బస్సును ఢీకొన్న బైక్.. యువకుడి మృతి


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, (ఇన్‌సెట్) మృతి చెందిన శివయ్య

బంగారుపాళెం : మండలంలోని పాలమాకులపల్లె సర్వీసు రోడ్డులో ఆదివారం ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొంది. దీంతో యువకుడు మృతి చెందాడు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. యానాది కాలనీకి చెందిన శివయ్య(22) బైక్‌లో పాలమాకులపల్లెకు వెళ్లి తిరిగి స్వగ్రామం బయలుదేరాడు. సర్వీసు రోడ్డులో చిత్తూరు నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ప్రమాదంలో శివయ్య తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసులు, సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని మాజీ సర్పంచ్ మృతి


మృతి చెందిన మాజీ సర్పంచ్ విజయన్

పాలసముద్రం : మండలంలోని సింహరాజుపురం నరసింహరాయని పేట వద్ద ఆదివారం ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో సింహరాజుపురం దళివాడకు చెందిన మాజీ సర్పంచ్ విజయన్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. విజయన్ (55) మేస్త్రీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నా డు. ఆయన ఆదివారం ఉదయం పనుల కోసమని సింహరాజుపురం నరసింహరాయని పేట వద్ద బస్సు స్టాప్ వద్ద ఉన్నాడు. ఈ క్రమంలో పళ్లిపట్టు నుంచి తిరువళ్లూరు వెళుతున్న బస్సును ఆపాడు. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును నడిపి విజయన్‌ను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. తమిళనాడు ఆర్కేపేట పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని షోలింగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రేపటి నుంచి సదరన్ స్లాట్స్

చిత్తూరు రూరల్(కాణిపాకం): సదరం స్లాట్‌లు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు డీసీహెచ్ఎస్ ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. బోగస్ పింఛన్ల ఏరివేతకు ప్రభుత్వం పింఛన్ల పునఃపరిశీలన కార్యక్రమాన్ని చేపడుతోంది. జిల్లాలోని జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో వారానికి మూడు రోజులు పాటు పింఛన్లు పొందుతున్న సదరన్ ద్వారా పింఛన్లు తీసుకుంటున్న వారిని పరీక్షిస్తోంది. ఈ కారణంగా మూడు నెలలుగా సదరం క్యాంపులకు చెక్ పెట్టింది. కాగా దివ్యాంగుల పెన్షనర్ల సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి మేరకు తిరిగి మంగళవారం నుంచి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం కానున్నాయని ఆమె పేర్కొన్నారు.

విద్యుత్ బిల్లుల వసూలు రూ.1.08 కోట్లు

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ బిల్లులు చెల్లింపు కేంద్రాలు ఆదివారం పనిచేశాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాలను తెరిచారు. దీంతో మొత్తం 11,300 వినియోగదారులు బిల్లులు చెల్లించగా తద్వారా రూ.1.08 కోట్లు వచ్చిందని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. సోమవారం సైతం బిల్లులు చెల్లించవచ్చన్నారు.

పెద్దబైలులో కోడెగిత్తల జోరు


దూసుకుపోతున్న కోడెగిత్తలు

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ పెద్దబైలు గ్రామంలో ఆదివారం ఎద్ల పందేలను ఘనంగా నిర్వహించారు. తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని గ్రామంలో ఎద్ల పందేలు నిర్వహించారు. జనప్రవాహాన్ని చీల్చుకుంటూ దూసుకువచ్చిన ఎద్లను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన ఎద్లకు సినీ హీరోల చిత్రపటాలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, బెలూన్లు, పలకలు కట్టి బహుమతులతో సిద్ధం చేశారు. అప్పటికే యువకులు బహుమతులను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జన ప్రవాహాన్ని చీల్చుకుని పరుగులు తీశాయి. పోట్లగిత్తలు జన ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా తమ ప్రతాపాన్ని చూపించాయి. యువకులు ఎంత ప్రయత్నించినా పశువుల దూకుడును కట్టడి చేయలేక నిరుత్సాహపడ్డారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరుకావడంతో పెద్దబైలు జనాలతో కిక్కిరిసింది.


ప్రదర్శనగా వస్తున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు